
సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 18 । నవంబర్ । 2023



ఆర్జిత సేవలు పునరుద్ధరణ

సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆర్జిత సేవలను శుక్రవారం నుంచి తిరిగి పునరుద్ధరించారు. 8లో



భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

జిల్లాలో నాగుల చవితి పండగను శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. 9లో



జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ కడబాల ఆనందరావు అన్నారు. 9లో

న్యూస్‌రీల్

విజయవంతంగా వికసిత్ భారత్ సంకల్పయాత్ర

● కలెక్టర్ సుమిత్‌కుమార్



వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రచార రథం

సాక్షి,పాడేరు: కేంద్ర ప్రభుత్వం అమలుజేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేసే వికసిత్ భారత్ సంకల్పయాత్రను జిల్లాలో విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మూడు ప్రచార రథాలు జిల్లాకు చేరుకున్నాయన్నారు. ఈనెల 15వతేదీన అరకులోయలో భగవాన్ బిర్సాముండా జయంతి రోజున అరకులోయలో వీటిని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రారంభించారని తెలిపారు. జిల్లాలోని 16 మండలాల పరిధిలో 329 గ్రామ పంచాయతీల్లో ప్రచార రథాలు సంక్షేమ పథకాలపై ప్రచారం చేస్తాయన్నారు. జిల్లాకు నోడల్ అధికారిగా విశాఖ పోర్ట్ ట్రస్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేస్‌కుమార్ దుబేను కేంద్ర ప్రభుత్వం నియమించిందన్నారు. ప్రచార రథాల షెడ్యూల్‌ను కూడా విడుదల చేసినట్టు కలెక్టర్ పేర్కొన్నారు. ఎంపిక చేసిన మండలాల్లో 2024 జనవరి 15వతేదీ వరకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు నిర్మల



విద్యార్థిని నిర్మలకు ధ్రువపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్

అరకులోయ టౌన్: హర్యానాలో వచ్చేనెల 9వ తేదీన జరిగే జాతీయ స్థాయి మహిళా కుస్తీ పోటీలకు అరకులోయ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని పాంగి నిర్మల ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్ కుమార్ నాయక్ తెలిపారు. ఈనెల 8వ తేదీన విశాఖలోని ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి అర్హత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు, పీడీ ఎస్. అప్పారావు, అధ్యాపకులు నిర్మలను అభినందించారు.

విధుల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

రాజవొమ్మంగి: మండలంలోని కింద్ర పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ గంటిమళ్ల నూకరత్నంను విధుల నుంచి తొలగించినట్లు స్థానిక ఉపాధి పీవో, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు శుక్రవారం తెలిపారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన కారణంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. స్పందన కార్యక్రమంలో అందిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి ఆమెపై చర్యలు తీసుకున్నారని ఆయన వివరించారు. ఈ మేరకు కలెక్టరేట్ నుంచి తమకు ఆదేశాలు అందాయన్నారు.

తల్లీబిడ్డల సంరక్షణపై అవగాహన కల్పించాలి



శిక్షణలో పాల్గొన్న వారితో రంపచోడవరం ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మి

రంపచోడవరం: తల్లీబిడ్డల సంరక్షణపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని రంపచోడవరం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి అన్నారు. కేర్ క్యాంపెయిన్ ప్రోగ్రామ్‌లో భాగంగా తల్లీబిడ్డ సంరక్షణకు నోరా హెల్త్, ఎన్‌హెచ్‌ఎం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తల్లీబిడ్డలకు కావాల్సిన ఇవ్వాల్సి పౌష్టికాహారం, ఎదగుదులకు ఉపయోగపడే అంశాలపై ట్రైనర్ అవగాహన కల్పించారు. రంపచోడవరం, అడ్డతీగల గంగవరం, వై రామవరం, చింతూరు, మారేడుమిల్లి, మాతా శిశు సంక్షేమ వైద్యసిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అసోసియేట్ ఎస్. మేఘన, కోఆర్డినేటర్ డాక్టర్ జె. భార్గవి, ఏరియా ఆస్పత్రి ఏవో ఎల్.దేవి, కౌన్సిలర్ ఎస్. వాసు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్రీయ బాలల ఆరోగ్య కార్యక్రమం ఎన్‌హెచ్ఎం ఆధ్వర్యంలో దంత సంరక్షణ కార్యక్రమం జరిగింది. పాఠశాల విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు.

వరి రైతు ఖుషీ!

జిల్లాలో వాతావరణ పరిస్థితులు అనుకూలించినందున ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉంది. పంటలకు అవసరమైన సమయంలో వర్షాలు కురవడంతో దిగుబడులు పెరగడంతో గిరి రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ నెలాఖరు నుంచి ధాన్యం కొనుగోలుకు పౌరసరఫరాలశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

- కలిసొచ్చిన ఖరీఫ్
- హుషారుగా వరి కోతలు
- సురక్షిత ప్రాంతాలకు వరిపనలు
- నూర్పులకు సిద్ధమవుతున్న గిరి రైతులు
- కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లలో పౌరసరఫరాలశాఖ



వరి కోతల్లో నిమగ్నమైన మహిళా కూలీలు



వరి పనలను మోసుకువెళ్తున్న గిరిజనులు

సాక్షి,పాడేరు: మన్యంలో గిరిజన రైతులు వరి కోతల్లో నిమగ్నమయ్యారు. జిల్లాలో 58,404 హెక్టార్లు వరి సాధారణ విస్తీర్ణం కాగా ఈ ఏడాది కాస్త తగ్గింది. చింతూరు డివిజన్‌లో వరదల కారణంగా ముంపు ప్రాంతాలు మినహా మిగిలిన చోట్ల 50,230 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు.

● రంపచోడవరం, పాడేరు డివిజన్ల పరిధిలో వర్షాలతో పాటు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో వరిపంట ఆశాజనకంగానే సాగయ్యింది. కోసిన వరి పనలు ఆరిన తరువాత సురక్షిత ప్రాంతాలకు తరలించి కుప్పలు వేస్తున్నారు.

ముందస్తుగా విత్తనాల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా గిరిజన రైతులకు ఖరీఫ్‌లో ప్రభుత్వం 90శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయడంతో ఉపయోగకరంగా మారింది. వరిలో 1061, 1064, 1121, సోనా, స్వర్ణ, సాంబ తదితర 17,363 క్వింటాళ్ల వరి విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా ముందస్తుగా వ్యవసాయశాఖ పంపిణీ చేసింది.

పుష్కలంగా ఉపాధి

జిల్లాలో వరి కోతలు ప్రారంభం కావడంతో గిరిజనులకు స్థానికంగా ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. రోజు కూలి రూ.250 వరకు ఉంది. సొంత భూముల్లో వరి కోతలు పూర్తయిన తరువాత కూలిపనులకు వెళ్తున్నారు. నెలాఖరు వరకు కోతలు జరిగే అవకాశం ఉన్నందున ఉపాధికి ఢోకా లేదని గిరి రైతులు పేర్కొన్నారు.

గతేడాది మాదిరిగా దిగుబడి

గతేడాది రంపచోడవరం డివిజన్ పరిధిలో హెక్టారుకు 3,200 కిలోలు,పాడేరు డివిజన్‌లో హెక్టారుకు 2,300 కిలోల ధాన్యం దిగుబడి వచ్చింది. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో దిగుబడి ఉంటుందని వ్యవసాయశాఖతోపాటు గిరిజనులు అంచనా వేస్తున్నారు.

నెలాఖరు నుంచి కొనుగోళ్లు

జిల్లా వ్యాప్తంగా ఈ నెలాఖరు నుంచి ధాన్యం కొనుగోళ్లకు పౌరసరఫరాలశాఖ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో 46 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనుంది.గ్రేడ్-ఏ ధాన్యం 100 కిలోలు రూ.2,203, సాధారణ రకం ధాన్యం 100 కిలోలు రూ.2,183 చొప్పున కొనుగోలుకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది.

ఆశాజనకంగా గింజ శాతం



వరి పైరు ఆశాజనకంగా ఉన్నందున గింజ శాతం కూడా మెరుగ్గానే ఉంది. జిల్లాలో వ్యవసాయ సిబ్బంది పంట కోత ప్రయోగం చేపట్టారు. గతేడాది మాదిరిగానే దిగుబడి బాగుండే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పాటుచేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించి లబ్ధి పొందాలి.

– ఎస్‌బీఎస్ నంద,
జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

27 నుంచి పారదర్శకంగా కులగణన

కలెక్టర్ సుమిత్‌కుమార్



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా ఈనెల 27 నుంచి కులగణనను పారదర్శకంగా చేపడతామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. తన కార్యాలయం నుంచి జిల్లాలోని 22 మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు.స్వయంగా ఇంటింటికి తిరిగి పరిశీలన చేసిన తర్వాత మాత్రమే కులగణన సర్వే చేయాలన్నారు.జెడ్పీటీసీలు, ఎంపీటీసీలను మండల స్థాయిలో సమావేశాలకు ఆహ్వానించాలని సూచించారు. వలంటీర్ల సీఎఫ్ఎంఎస్ ఐడీ ద్వారా సమాచారం సేకరించాలని ఆయన సూచించారు. కులగణన యాప్‌లో 13 కాలమ్‌లను పూర్తి చేయాలన్నారు. కులగణనకు సంబంధించి వచ్చే సోమ, మంగళవారాల్లో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని, సర్వే సమయంలో పక్కా గృహాలు, గ్యాస్ కనెక్షన్ల సమాచారం కూడా తెలుసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ శివశ్రీనివాస్, బీసీ,ఎస్సీ విభాగం అధికారులు నరసింహులు, జనార్దనరావు, ఎల్.ఆనందరావు, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు పాల్గొన్నారు.

సికిల్ ఎనీమియా పట్ల అప్రమత్తం

డీఎంహెచ్‌వో జమాల్‌బాషా



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

పాడేరు రూరల్: సికిల్ సెల్ ఎనీమియా పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా అన్నారు. బాలల దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం పాడేరు జిల్లా ఆసుపత్రిలో పిల్లలకు స్కానింగ్ పరీక్షలు,సికిల్ సెల్ ఎనీమియా వ్యాధితో బాధపడుతున్న 19 సంవత్సరాల లోపు చిన్నారులకు ఉచితంగా నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో చీలిక పెదవి, అంగిలి కలిగిన పిల్లలకు ఉచితంగా శస్త్ర చికిత్స చేస్తున్నామన్నారు. శస్త్ర చికిత్సల అనంతరం ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆదేశాల మేరకు వైద్య ఖర్చుల నిమిత్తం వారి వ్యక్తిగత ఖాతాల్లో రూ.5 వేలు జమచేస్తామన్నారు. సికిల్ సెల్ ఎనీమియా పిల్లను ముందస్తుగా గుర్తించి మెరుగైన సేవలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, డీఈఐసీ డాక్టర్ బాబ్జి, దంత వైద్యాధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



సమీక్షిస్తున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో శుక్రవారం గిరిజన సంక్షేమశాఖ డీడీ, వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనీమియా రాకుండా ముందుగానే గుర్తించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఇప్పటి వరకు నిర్వహించిన హెచ్‌బీ పరీక్షలకు సంబంధించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రక్తహీనతతో బాధ పడుతున్న విద్యార్థుల వివరాలు అందజేయాలని ఆదేశించారు. వైద్యాధికారులు ఆశ్రమ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యులతో నిర్వహించిన సమీక్షలో పీవో మాట్లాడుతూ ఏజెన్సీలో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో ఖాళీగా ఉన్న పోస్టులు వివరాలు అందజేయాలని తెలిపారు. జగనన్న సురక్ష పథకంలో అందించిన వైద్య సేవలపై సమీక్షించారు. ఈ సమావేశంలో గిరిజన డీడీ జాన్‌రాజ్, ఏడీఎంహెచ్‌వో ప్రకాశం, ఏటీడబ్ల్యూవో రామ తులసి, ఎంఈవో ఎంవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆయుర్వేదాన్ని ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



ప్రదర్శనలో ఉంచిన ఔషధ మొక్కల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- అడ్డతీగలలో ఆదివాసీ వన మూలికా వైద్యుల సమ్మేళనం

అడ్డతీగల: అంతరించిపోతున్న ఆదివాసీ ఆయుర్వేద వైద్యానికి గత వైభవం తేవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. అడ్డతీగల శివారులో లయ స్వచ్ఛంద సంస్థకు అనుబంధమైన ఆదివాసీ వన మూలిక వనరుల కేంద్రం (వనంతరం)లో పార్వతీపురం, సీతంపేట, పాడేరు, రంపచోడవరం ఐటీడీఏల పరిధిలోని ఆదివాసీ వన మూలికా వైద్యుల సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమ్మేళనంలో మొదటి రోజు 200 మంది ఆదివాసీ వైద్యులు పాల్గొన్నారు. వన మూలికలకు చెందిన వివిధ రకాల మొక్కలు, దుంప, విత్తన జాతులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ చాలా మంది ప్రజలు కరోనా మహమ్మారి సమయంలో సంప్రదాయ ఆయుర్వేద వైద్యంపై ఆధారపడ్డారన్నారు. కరోనా తర్వాత ఆయుర్వేద వైద్యంపై ప్రజల్లో ఆసక్తి పెరిగిందన్నారు. వన మూలికా వైద్యాన్ని విస్తృతంగా వ్యాప్తిలోనికి తీసుకురావడం ద్వారా ఆదివాసీలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ఎన్నో ఔషధ గుణాలు

ప్రకృతిలో సహజసిద్ధంగా పెరిగిన మొక్కల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయని ఏపీ మెడిషినల్ అండ్ అరోమాటిక్ ప్లాంట్ బోర్డ్ సీఈవో డాక్టర్ అశోక్ కుమార్ అన్నారు. ప్రకృతి వరప్రసాదినిగా ఉండే వన మూలికా మొక్కలను ఉపయోగించి ఆయుర్వేద మందులు తయారుచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు.వనమూలికా వైద్యుల సదస్సులు ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరమన్నారు.ఆదివాసీలు పత్తి, పొగాకుకు బదులు ఔషధ మొక్కల పెంపకం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చన్నారు.

అవగాహన కల్పించాలి

సంప్రదాయ వైద్య విజ్ఞానంపై రాబోయే తరానికి అవగాహన కల్పించాలని ఏపీ స్టేట్ బయోడైవర్సిటీ బోర్డ్ కోఆర్డినేటర్ డాక్టర్ వరలక్ష్మి అన్నారు. ఔషధ మొక్కలు పెంచడంతో పాటు ఈ వైద్య విజ్ఞానాన్ని గ్రంథస్థం చేసి మూలికా వైద్యులకు గుర్తింపు పత్రాలు వచ్చే విధంగా కృషి చేస్తానని చెప్పారు. వివిధ అంశాలపై పలువురు మాట్లాడారు.ఆయుష్ మెడికల్ ఆఫీసర్ దేశీయ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సబ్బిన శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, లయ స్వచ్ఛంద సంస్థ ఏరియా కోఆర్డినేటర్ జి.బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు సత్వర వైద్యసేవలు



పాడేరు జిల్లా ఆస్పత్రిలో ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న డాక్టర్ నర్సింగరావు



పాడేరు జిల్లా ఆస్పత్రిలో బాధితులతో మాట్లాడుతున్న ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు

సాక్షి,పాడేరు: మండలంలోని ఐనాడ ఘాట్‌లో గురువారం రాత్రి మినీ వ్యాన్ బోల్తా ఘటనలో క్షతగాత్రులకు సత్వర వైద్యసేవలు అందుతున్నాయి. స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు శుక్రవారం పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలకు చర్యలు తీసుకున్నారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఉలం ఇషాక్ ఉన్నత వైద్యసేవలపై ఆయనతో వైద్యులతో మాట్లాడారు. మృతుడు నూకరాజు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సలుగు, ఐనాడ, వంట్లమామిడి పంచాయతీల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. జిల్లా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్న బాధిత గిరిజనులను రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు పరామర్శించారు.

'జగనన్నకు చెబుదాం' వినతులపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు
- 71 అర్జీల స్వీకరణ



గిరిజనుల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన వినతులపై అన్నిశాఖల అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏలో ప్రత్యేక స్పందన నిర్వహించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి వ్యక్తిగత, సామాజిక సమస్యలపై 71 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే, ఇంజినీరింగ్ విభాగాలు, వ్యవసాయశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాల్లో పెండింగ్‌లో ఉన్న వినతుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, ఎస్‌డీసీ వి.వి.ఎస్.శర్మ, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

● అటవీ హక్కుపత్రాలు మంజూరు చేయాలని పాడేరు మండలం కుజ్జెలి గ్రామానికి చెందిన గిరిజనులు కించేయి నాగమణి,పాంగి రత్నకుమారి,కిల్లో సత్యవతి వినతిపత్రం అందజేశారు.

● పెదబయలు మండలం లింగేటి పంచాయతీ కేంద్రం నుంచి కుంకంమామిడికి రోడ్డు నిర్మించాలని పి.కొండబాబు, మోహనరావు, నరేష్, కిముదుపల్లి పంచాయతీ వంతిర్బ గ్రామంలో అంగన్‌వాడీ భవనం నిర్మించాలని కె.బాబూరావు, కామేశ్వరరావు కోరారు

● పాడేరు మండలం ఇరాడపల్లి పంచాయతీ డి.సంపలు గ్రామంలో అంగన్‌వాడీ భవనం నిర్మించాలని సర్పంచ్ గుల్లెల అశ్విజ, ఎస్.బొడ్డాపుట్టు గ్రామానికి విద్యుత్‌లైన్‌ను ఎగుసోలములు మీదుగా మార్పు చేయాలని ఆ ప్రాంతానికి చెందిన మహేష్, నాగేశ్వరరావు కోరారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట (విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ జె. సుభద్ర అధ్యక్షతన జరగనుందని సీఈవో ఎం.పోలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి గౌరవ సభ్యులు, ఆహ్వానితులు హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు.

1 నుంచి 7 వరకు స్థాయీ సంఘ సమావేశాలు

శనివారం ఉదయం 9 గంటలకు స్థాయీ సంఘ సమావేశాలు ప్రారంభం అవుతాయన్నారు. ఉదయం 9 గంటలకు 2, 5వ స్థాయి, 9.30 గంటలకు 3, 4వ స్థాయి, ఉదయం 10 గంటలకు 1, 6, 7వ స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈవో ఆ ప్రకటనలో తెలిపారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్(విశాఖ) : నగరంలోని బురుజుపేటలో వెలసిన శ్రీ కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకు వస్తున్న అర్చకులు

కొమ్మాది (భీమిలి): రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు.

108లో సుఖ ప్రసవం



శిశువును కుటుంబసభ్యులకు అందజేస్తున్న సిబ్బంది

హుకుంపేట: మండలంలోని గూడ పంచాయతీ గొచ్చరి గ్రామానికి చెందిన పి.వేదిక అనే గర్భిణి 108లో మగబిడ్డను జన్మనిచ్చింది. గురువారం అర్ధరాత్రి ఆమెకు పురిటి నొప్పిలు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. దీంతో 108లో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో ప్రసవించింది. ప్రస్తుతం తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నట్టు ఈఎంటీ శ్రీను తెలిపారు.

హాట్‌కేకుల్లా టీ-20 టికెట్లు

కౌంటర్ల వద్ద బారులుతీరిన అభిమానులు



టికెట్ల కోసం క్యూలో క్రికెట్ అభిమానులు

విశాఖ స్పోర్ట్స్: విశాఖలో వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా ఈనెల 23న జరగనున్న భారత్-ఆస్ట్రేలియా టీ20 తొలి మ్యాచ్ టికెట్లు హాట్ కేక్‌లా అమ్ముడయ్యాయి. ఇప్పటికే ఏసీఏ ఆధ్వర్యంలో పేటీఎం ద్వారా ఆన్‌లైన్ టికెట్ల విక్రయాన్ని ముగించగా శుక్రవారం ఐదు వేల టికెట్లను ఆరు డినామినేషన్లలో కౌంటర్ల ద్వారా విక్రయించారు. వైఎస్సార్ స్టేడియంతో పాటు టౌన్ కొత్తరోడ్, గాజువాకల్లోని మున్సిపల్ స్టేడియాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి టికెట్లను విక్రయించారు. కనీస ధర రూ.600 నుంచి గరిష్ట ధర రూ.6000లో పాటు రూ.1500, రూ.2000,రూ.3000,రూ.3500లు టికెట్లను మూడు ప్రాంతాల్లో మహిళలకు, పురుషులకు వేర్వేరుగా కౌంటర్లను ఏర్పాటు చేసి విక్రయించారు. శుక్రవారం ఉదయం నుంచే ఆయా సెంటర్ల వద్ద అభిమానులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. వైఎస్సార్ స్టేడియం బి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన టికెట్ల విక్రయాన్ని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసిన కలెక్టర్ ఎ.మల్లికార్జున, సీపీ రవిశంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా పొందిన టికెట్లను స్టేడియంలో ప్రవేశానికి ఫిజికల్ టికెట్లుగా మార్చుకునేందుకు ఆయా సెంటర్లలోనే 22వ తేదీవరకు అవకాశం కల్పించగా మ్యాచ్ జరిగే రోజు ఈనెల23న స్టేడియంలోనూ టికెట్లను మార్చుకునేందుకు అవకాశం కల్పించామని గోపినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆఫ్‌లైన్‌లో శనివారం సైతం ఆరు డినామినేషన్లలో టికెట్లను ఆయా కౌంటర్ల ద్వారా విక్రయించనున్నామని తెలిపారు.

అసంపల్లికి రూ.కోటితో రహదారి నిర్మాణం

చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ చొరవ



బండరాళ్లను తొలగిస్తున్న గ్రామస్తులు



నిర్మించిన మంచి నీటి ట్యాంక్‌లు

చింతపల్లి రూరల్: గూడెంకొత్తవీధి మండలం జెర్రిల పంచాయతీలో మారుమూల గ్రామమైన అసంపల్లికి రహదారి, మంచినీటి పథకం అందుబాటులోకి రానున్నాయి. ఆంధ్రా- ఒడిశా సరిహద్దులోని ఈ గ్రామాన్ని గత నెలలో చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ సందర్శించారు. రహదారి, తాగునీటి సమస్యను గ్రామస్తులు ఆయనకు వివరించారు. ఈ సమస్యలను ఎస్పీ తుహిన్ సిన్హా దృష్టికి ఆయన తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎస్పీ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు. దీనిలో భాగంగా కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌తో మాట్లాడారు. జెర్రిల నుంచి అసంపల్లి వరకు ఐదు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు రూ.కోటి మంజూరు చేశారు. ఈ మేరకు పనులు ప్రారంభమయ్యాయి. పోలీసుల ఆర్థిక సాయంతో రెండు మంచి నీటి ట్యాంక్‌లు ఏర్పాటుచేశారు.

ఒత్తిడిని జయిస్తే విజయం సొంతం



అవగాహన కల్పిస్తున్న మానసిక వైద్య నిపుణురాలు తేజస్విని తదితరులు


అనంతగిరి: ఒత్తిని జయించి, విజయం సాధించాలని, మానసిక వైద్య నిపుణురాలు వైద్యాధికారి తేజస్విని అన్నారు. మండలంలోని అనంతగిరి, భీమవారం పీహెచ్‌సీల్లో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో శుక్రవారం సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు వివిధ రకాల మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి వైద్య సిబ్బంది అవగాహన కల్పించి, ధైర్యం చెప్పాలన్నారు. మానసిక రోగుల్లో ఆత్మస్థైర్యం నింపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా టెలిమానస్ కార్యక్రమం ద్వారా మానసిక రోగులకు సలహాలతో పాటుగా మందులను అందజేస్తుందన్నారు. మానసిక రోగులు 14416 నంబర్‌కు ఫోన్‌చేసి, తమ సమస్యలను తెలియజేసి, పరిష్కరించుకోవచ్చన్నారు. డాక్టర్ జాహ్నవి, ఎంపీహెచ్ఈవో నర్సింగరావు పాల్గొన్నారు.

నాన్ అఫీషియల్ సభ్యుల నియామకానికి దరఖాస్తులు

పాడేరు రూరల్: జిల్లాలో జిల్లా విజిలెన్స్ కమిటీ, మోనరిటింగ్ కమిటీలో నాన్ ఆఫీసియల్ సభ్యుల నియాకానికి దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి జి.జగన్నాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. నాన్ ఆఫీసియల్ సభ్యుల కోసం ఎస్సీ, ఎస్టీ విభాగాలకు చెందిన ముగ్గురు, స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న నాన్ ఎస్సీ, ఎస్టీ విభాగాల్లో అనధికారి సభ్యుల నియామకానికి ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా కమిటీలో సభ్యులుగా చేరే వారు అల్లూరి జిల్లాకు చెందిన వారే ఉండాలని, ఆధార్ కార్డు జెరాక్స్, ఫోటోలు, బయోడేటాను దరఖాస్తుతో జతపరిచి, జిల్లా షెడ్యూల్డ్ కుల సంక్షేమ, సాధికారిత అధికారికి అందించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 8985868068 నంబర్‌కు సంప్రదించాలని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలని ఆయన కోరారు.

121 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాల పరిధిలోని 8 అనుబంధ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న 121 పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ జారీ అయ్యింది. కాంట్రాక్ట్/అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పోస్టులు భర్తీ చేయనున్నట్టు ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. ఈ పోస్టుల వివరాలు,ఇతర సమాచారాన్ని వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. www.amc.edu, www.visakhapatnam.ap.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరిచినట్టు వివరించారు.



మన్యంలో ఉదయం వేళ ప్రకృతి అందాలు కట్టిపడేస్తున్నాయి. కాఫీ తోటలను కమ్మేసిన మంచు తెరలను చీల్చుకుంటూ ప్రసరిస్తున్న ఉదయ భానుడి కిరణాలు అబ్బురపరుస్తున్నాయి. ఈ అపురూప దృశ్యం గూడెంకొత్తవీధి కాఫీతోటల్లో కనువిందు చేసింది. – గూడెం కొత్తవీధి

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ప్రజాప్రతినిధులు

డుంబ్రిగుడ: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. కితలంగి పంచాయతీ కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యా శిబిరాన్ని అరకు ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయలేని విధంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకం జగనన్న ఆరోగ్య సురక్ష అన్నారు. ఈ పథకం పేద ప్రజలకు ఎంతో వరంగా ఉందన్నారు. అన్ని వ్యాధులను పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు తీసుకునే అవకాశం మన రాష్ట్రంలోనే అమలవుతుందని, దీనిని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, సర్పంచ్‌లు సుబ్బారావు,నాగేశ్వరరావు,ఎంపీటీసీ దేవి, వైస్ సీని ఎంపీపీ శెట్టి ఆనందరావు, నాయకులు బాక సింహాచలం, కృష్ణారావు, ఉపాధ్యక్షులు గణపతి.జగ్గునాయుడు, లీలారాణి, మోహన్‌రావు, మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు పాల్గొన్నారు. వైద్యులు రాంబాబు, ప్రేమ, సిబ్బంది రామారావు, సర్వ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యుడు దినేష్

చింతపల్లిరూరల్: గిరిజనులు మారుతున్న వాతావరణ పరిస్థితులు బట్టి రోగాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని లంబసింగి డాక్టర్ దినేష్ అన్నారు. మండలంలో లోతుగడ్డ జంక్షన్‌లో శుక్రవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ దినేష్ మాట్లాడుతూ గోరువెచ్చని నీటిని తాగాలని సూచించారు. అనారోగ్యమైతే వెంటనే సమీపంలోని ఆస్పత్రిని సందర్శించి వైద్యం పొందాలని కోరారు.కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

9న లోక్ అదాలత్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి జడ్జి శివ కిరణ్

అరకులోయటౌన్: డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు అరకులోయ ప్రథమ శ్రేణి జుడిషియల్ ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ ఎం.శివ కిరణ్ తెలిపారు. అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల పోలీసు అధికారులు, లాయర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీపడే కేసుల పరిష్కారం కోసం అందరూ కృషి చేయాలన్నారు. ఏపీపీ రమేష్, న్యాయవాదులు ప్రభాకర్, మురళీ మోహన్, సింహాచలం, ప్రేమ్‌చంద్, రత్నరాజు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి



ఊట్ల గ్రామంలో డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రంపచోడవరం: గిరిజన రైతులు ఆధునికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని రంపచోడవరం వైస్ ఎంపీపీ పండా కుమారి అన్నారు. మండలంలో ఊట్ల గ్రామంలో సర్పంచ్ అధ్యక్షతన జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. రంపచోడవరం ఎస్‌బీఐ బ్యాంకు ఊట్ల గ్రామంలో సురక్ష బీమా యోజన, జన్‌ధన్ బ్యాంకు ఖాతాలు, కిషన్ క్రెడిట్ కార్డులు మెగా డ్రైవ్‌ను నిర్వహించారు. రైతులకు ఉపయోగపడే నానో ఫెర్టిలైజర్స్ పథకంపై అవగాహన కల్పించి డ్రోన్‌లతో మందులు పిచికారీ విధానంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఎంపీడీవో హరికృష్ణ, కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు




పట్టుబడిన గంజాయి, నిందితుడితో పోలీసులు

చింతూరు: మండలంలోని చట్టి వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా రూ.40 వేల విలువైన 20 కిలోల గంజాయిని తరలిస్తున్న మత్త సంజయ్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. వాహనాలు తనిఖీలు చేస్తున్న క్రమంలో బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆపేందుకు ప్రయత్నించగా హరి అనే వ్యక్తి పారిపోగా సంజయ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు.అతడిని సోదా చేయగా 20 కిలోల గంజాయి లభ్యమైందని, గంజాయిని ఒడిశాకు చెందిన కిలో రామచంద్ర వద్ద కొనుగోలు చేసి తెలంగాణకు చెందిన అభిరాంకు అమ్మేందుకు తీసుకెళుతున్నట్టు ఎస్ఐ తెలిపారు. బైక్‌తో పాటు మొబైల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని తహసీల్దార్ కారం సుబ్బారావు సమక్షంలో పరిశీలించారు.

ఆర్జిత సేవలు పునరుద్ధరణ

సింహాచలం (విశాఖ) : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆర్జిత సేవలను శుక్రవారం నుంచి తిరిగి పునరుద్ధరించారు. తిరునక్షత్రం పూజ లు సందర్భంగా ఈనెల 12నుంచి 16వతేదీ వరకు ఆర్జిత సేవలన్నీ రద్దు చేశారు. తిరునక్షత్రం పూజలు ముగియడంతో తిరిగి యథావిధిగా ఆర్జిత సేవలు పునరుద్దరించారు. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని మండపంలో వేంజేంపజేశారు. విష్వక్సేణ పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అర్చకులు అందజేశారు.

పాముకాటుతో అస్వస్థత



బాలమ్మకు చికిత్స చేస్తున్న డాక్టర్ ఇంద్ర ప్రియాంక

చింతపల్లిరూరల్: గిరిజన మహిళ పాము కాటుకి గురైన సంఘటన చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గూడెం మండలం కొడిసింగికి గ్రామానికి చెందిన బోనంగి బాలమ్మ శుక్రవారం పొలం పనులకు వెళ్తుండగా దారి మధ్యలో పాము కాటుకు గురైంది. కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన పెదవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఇంద్ర ప్రియాంక చికిత్స అందించారు.